ఈనాడు చిత్తూరు

శుక్రవారం అక్టోబరు 18, 2024 | 5

విరుబూసి.. ధరల దోబూచి..!



శాంతిపురం మండలం రేగడదిన్నేపల్లె వద్ద విరగ కాసిన చామంతి




చామంతి పూలు ఒబ్బిడి చేస్తున్న రైతు కుటుంబం

దసరా.. దీపావళి.. కొత్త సంవత్సరం.. సంక్రాంతి వరుస పండుగల అవసరాలు దృష్టిలో ఉంచుకొని జిల్లాలో విస్తారంగా చామంతి సాగు చేసిన రైతుల పరిస్థితి ప్రస్తుతం గోరు చుట్టుపై రోకటిపోటులా మారింది. దసరా తర్వాత పూల ధరలు క్రమేణా తగ్గుముఖం పట్టి నష్టాలు వచ్చాయి. తాజా వర్షాలు దిక్కుతోచని స్థితిని కల్పించాయి. కుప్పం, పలమనేరు, పుంగనూరు తదితర ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా కాసిన పూలు జడివానతో తడిసి కుళ్లిపోతున్నాయి. నాలుగు రోజుల కిందట కిలో చామంతి పూల రూ.వంద వరకు పలికింది. వర్షాలకు తోటల్లోనే తడిసిపోవడంతో కొనుగోలుదారులు ముందుకు రాక ధరలు పతనమయ్యాయి. గురువారం స్థానిక మార్కెట్‌లో కిలో రూ.30 మాత్రమే పలికినట్లు అన్నదాతలు తెలిపారు. కనీసం పూల ఒబ్బిడి కూలి గిట్టుబాటు కావడంలేదని వాపోతున్నారు.

వర్షాలతో పడిపోయిన చామంతి ధరలు

- న్యూస్‌టుడే, శాంతిపురం

తీగ లాగేదెవరు..? డొంక కదిలేదెప్పుడు..?



◆ నిరుద్యోగులకు పలు సంస్థల పేరిట నియామక పత్రాలు
◆ వేతనాలకు ఒత్తిడి చేస్తే చెల్లని చెక్కులు ◆ ఉమ్మడి జిల్లా అంతటా బాధితులు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే:

వైకాపా హయాంలో ఉద్యోగ ప్రకటనలు రాకపోవడంతో నిరుద్యోగులు ఉపాధికి ఆరాటపడ్డారు. ఉద్యోగ వేటలో ఉన్న నిరుద్యోగులకు అక్రమార్కులు గాలం వేశారు. పాఠశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రైవేటు కంపెనీల పేరుతో నియామకపత్రాలు సృష్టించారు. వాటిని నిరుద్యోగుల చేతిలో పెట్టి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షలు దండుకున్నారు. పాఠశాలల్లో విధులకు వెళ్లిన వీరిని ప్రధానోపాధ్యాయులు అనుమతించారు. వీరిని తీసుకోవాలని ఎలాంటి ఆదేశాలు రాకున్నా అంగీకరించడం.. నెలల తరబడి పనిచేసినా వారికి వేతనాలు ఇవ్వకపోవడం.. ప్రశ్నించిన కొందరికి చెల్లని చెక్కులు చేతిలో పెట్టడం.. బాధితులు ఫిర్యాదు చేస్తే విద్యాశాఖ మొదలు ఏ శాఖ పట్టించుకోకపోవడం.. ఇలా ఈ అక్రమంలో అన్ని శాఖల హస్తం ఉందని వెల్లడవుతున్నా.. అంతకుమించి నాటి అధికార పార్టీ నేతల హస్తం ఉందని తెలుస్తున్నా ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం దీనిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

మోసగించిందిలా..

కుప్పం ప్రాంతంలోని ఓ ఆదర్శ పాఠశాలలో ఒప్పంద ఉద్యోగి ఇందులో కీలకంగా వ్యవహరించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అతను కుప్పం పట్టణాలు సహా చిత్తూరు, తిరుపతి నగరాల్లో కొందరిని ఏజెంట్లుగా నియమించుకుని శాంతిపురం, పలమనేరు, పుంగనూరు, అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలోనూ పలువురు నిరుద్యోగులకు ఎర వేసి నగదు వసూలు చేశారు. ఒక్కో ఉద్యోగానికి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల మేర తీసుకున్నారు. బాధితులు వందల సంఖ్యలో ఉంటారని వాపోతున్నారు.

ఉద్యోగాలు ఒక్కటే.. కంపెనీలే వేరు

కుప్పం మండలం చందం జడ్పీ హెచ్ఎస్‌లో రికార్డు అసిస్టెంట్, పాలసముద్రం మండలం ఎస్.ఆర్.ఆర్. కండ్రిగ జడ్పీహెచ్ఎస్‌లో రికార్డు అసిస్టెంట్ నియామక పత్రాలు అందుకున్న ఇద్దరికి వేర్వేరు సంస్థల పేరిట నియామకపత్రాలు ఇచ్చారు. శాంతిపురం మండలం కెనమాకులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ఎం. కరుణాకర్ అనే బాధితుడికి ఓ హెల్త్‌కేర్ సంస్థ పేరిట డిజిటల్ అసిస్టెంట్‌గా నియమిస్తున్నట్లు నకిలీ పత్రాన్ని సృష్టించారు. ఒకే ఉద్యోగానికి రెండు కంపెనీల నుంచి నియామకపత్రాలు ఇచ్చారంటే అక్రమాల స్థాయి ఏంటో తెలుస్తోంది.

నగదు అడిగితే బెదిరింపులు

నాకు ఉద్యోగం లేదు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో నడుమూరు ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించాడు. అప్పుచేసి రూ.2.85 లక్షలు అతనికి ఇచ్చా. ఓ హెల్త్‌కేర్ సంస్థ పేరిట శాంతిపురం మండలం కెనమాకులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తున్నట్లు నియామకపత్రాన్ని అందించాడు. అక్కడ మూడు నెలలు పనిచేశా. జీతం అందలేదని అడిగితే త్వరలో వస్తుందని చెప్పడంతో ఏడాది పనిచేశా. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సర్వీస్ సర్టిఫికెట్ జారీ చేశారు. తీరా నకిలీ ఉద్యోగమని తెలిసి నగదు ఇవ్వాలని కోరితే అసలు నువ్వు ఇచ్చినట్లు ఆధారాలు ఏమి ఉన్నాయంటూ బెదిరిస్తున్నారు. – కరుణాకర్, కోనేరుకుప్పం



చెల్లని చెక్కులతో బురిడీ



చందం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏడు నెలలపాటు పనిచేసిన కుప్పం మండలం నూలుకుంట గ్రామానికి చెందిన శాంతమూర్తికి వేతనం కింద రూ.80 వేల చెక్కు అందించారు. దాన్ని తీసుకుని బ్యాంకులో నగదు డ్రా చేసేందుకు వెళ్లగా.. సదరు బ్యాంకు ఖాతాలో నగదు మైనస్‌లో ఉందనే సమాధానం వినిపించింది. ఇలా చాలామందికి చెక్కులు ఇచ్చారని బాధితులు వాపోతున్నారు.

పట్టించుకోని విద్యా, పోలీసు శాఖలు

ఈ దందా వైకాపా హయాంలో 2023, 24లో జరిగింది. న్యాయం కోసం అప్పటి జిల్లా విద్యాశాఖ అధికారులు, కలెక్టర్‌కు బాధితులు వినతిపత్రాలు అందించారు. వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోకుండా అక్రమార్కులు అప్పటి వైకాపా ప్రజా ప్రతినిధుల పేర్లు వినియోగించినట్లు తెలిసింది. పోలీసులకు ఫిర్యాదులు చేసేందుకు బాధితులు వెళ్లినా.. ఆ ఫిర్యాదులను తిరస్కరించినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసినా..

పేరు చెప్పేందుకు ఇష్టపడని కుప్పం మండలం వెండుగంపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితను ఇలాగే మోసగించారు. ఉద్యోగం కోసం రూ.2.80 లక్షల నగదు దండుకున్నారు. ఓ సంస్థ పేరుతో నియామక పత్రాన్ని పొందిన ఆమె గోనుగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసింది. చివరికి జీతం రాకపోవడంతో ఆమె డీఎస్సీ శిక్షణకు వెళ్లేందుకు ఆ ఉద్యోగాన్ని మానేసినట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఎండా.. వానా ఏకమై



అయితే వాన.. లేదంటే ఎండ.. కానీ రెండూ ఒకేసారి వస్తే ఆ ఆనందమే వేరు. చిత్తూరు నగర శివారులోని అగ్రహారం, మురకంబట్టులో కనిపించిన ఈ దృశ్యం స్థానికులకు ఆహ్లాదాన్ని పంచింది. ఉదయం నుంచి ఎండ ఉండగా సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు కమ్మి వర్షం కురిసింది. ఎండలోనే వర్షం రావటంతో ప్రజలు ప్రకృతిని ఆస్వాదించారు. దీంతో వర్షం చుక్కలపై సూర్యకిరణాలు పడుతుండటంతో అవికాస్తా వజ్రాల్లా మెరుస్తూ కనువిందు చేశాయి.

- ఈనాడు, చిత్తూరు

తూర్పు ప్రాంత చెరువులకే చేరిన నీరు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులు వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు కురిసి.. చెరువులు, జలాశయాలు పొంగి పొర్లుతాయని ఆశపడిన అన్నదాతకు వరుణుడు నిరాశే మిగిల్చాడు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలకు జిల్లాలోని ఎన్టీఆర్ జలాశయం, కృష్ణాపురం ప్రాజెక్టుకు స్వల్పంగా నీరు చేరింది. తూర్పు ప్రాంత మండలాలు నగరి, విజయపురం, నిండ్ర, పాలసముద్రం, ఎస్ఆర్‌పురం మండలాల్లో కొన్ని చెరువులకు 50 శాతం నీరు చేరింది. మిగిలిన పశ్చిమ ప్రాంత, చిత్తూరు పరిసర ప్రాంత మండలాల్లోని చెరువులను పరిశీలిస్తే.. ఒక్క చుక్క నీరు చేరని చెరువులు ఉన్నాయి. 0-15శాతం నీరు చేరిన చెరువులు చాలా తక్కువగా ఉన్నాయని జల వనరుల శాఖ ఇంజినీర్లు పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లో భారీగా వర్షం కురిస్తే తప్ప జలాశయాలు, చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశం లేదని జల వనరుల శాఖ ఇంజినీర్లు అంటున్నారు.

29 మండలాల్లో వర్షం: చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో బుధవారం రాత్రి జిల్లాలోని 29 మండలాల్లో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. రొంపిచర్ల మండలంలో 39.2 మి.మీటర్లు, కార్వేటినగరం 29.8, పాలసముద్రం 28.6, సోమల 27, నిండ్ర 24.4, వెదురుకుప్పం 23.2, పెద్దపంజాణి 22.2, పెనుమూరు 21, పులిచెర్ల 20.8, నగరి 19.4, చౌడేపల్లె 19.2, పూతలపట్టు 19, ఎస్ఆర్‌పురం 18.2, సదుం 17.4, పుంగనూరు 15.6, ఐరాల 14.6, విజయపురం 13 మి.మీటర్లు కురవగా.. మిగిలిన మండలాల్లో చిరుజల్లుల వర్షపాతం నమోదైంది.



వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో జేసీ విద్యాధరి తదితరులు

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్ని కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. జేసీ విద్యాధరి మాట్లాడుతూ బోయ కులంలో జన్మించిన వాల్మీకి.. తాను తపస్సుతో రుషిగా మారారన్నారు. వాల్మీకికి శ్రీరాముడిపై ఉన్న అపార భక్తి మార్గంతోనే రామాయణ మహాకావ్య రచన సాధ్యమైందన్నారు. వేల శ్లోకాలతో రామాయణాన్ని రమ్యంగా రచించారని కొనియాడారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీబాషా, బీసీ కార్పొరేషన్ ఈడీ బి.శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనుల్ని త్వరగా పూర్తిచేయాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బ్లాక్ లెవల్ హెల్త్ యూనిట్ల నిర్మాణ పనుల్ని త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. వైద్యశాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. మాతాశిశు మరణాల నివారణ, గర్భస్థ పిండ ఆరోగ్య సంరక్షణలో భాగంగా స్కానింగ్ నిర్వహణకు పాలసముద్రం, విజయపురం, బొమ్మసముద్రం, కాణిపాకం, తవణంపల్లె, చౌడేపల్లె, బైరెడ్డిపల్లె, శాంతిపురం మండలాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. గుత్తేదారులు త్వరగా పనులు పూర్తిచేసేలా పర్యవేక్షించాలన్నారు. డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, పీఆర్ ఎస్ఈ శంకర్‌నారాయణ పాల్గొన్నారు.

నేడు సఫాయి కర్మచారీ కమిషన్ ఛైర్మన్ రాక

సఫాయి కర్మచారీ కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు చిత్తూరు చేరుకుంటారు. 3 గంటలకు కలెక్టర్, ఎస్పీతో కలిసి పారిశుద్ధ్య కార్మికుల కాలనీల్ని పరిశీలిస్తారు. వారికి అందుతున్న సంక్షేమ కార్యక్రమాలపై 3.30 గంటలకు కలెక్టరేట్‌లో సమీక్షిస్తారు. ఆపై తిరుపతి వెళ్తారు.

గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగు: కలెక్టర్

రొంపిచర్ల (పుంగనూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయని జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం రొంపిచర్లలో పనులకు భూమి పూజ చేశారు. పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పల్లెలకు మహర్దశ కలగనుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కాలనీలో రూ.10లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనికి భూమి పూజ చేశారు. సర్పంచి ఇబ్రహీంఖాన్, మండల తెదేపా అధ్యక్షుడు ఉయ్యాల రమణ, తహసీల్దారు వినాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే బీసీ బాలుర హాస్టల్, మల్లెలమిట్ట ప్రాజెక్టును జిల్లా కలెక్టరు సందర్శించారు.



సీసీరోడ్డు, మురుగు కాల్వ పనులకు భూమి పూజ చేస్తున్న జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్

పైవంతెనల నిర్మాణాలు పైపైనే..?



ఐరాల-చిత్తూరు ప్రధాన రహదారిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద దిగువ చప్టా

ఏళ్లు గడుస్తున్నా ఫలితం శూన్యం

తాత్కాలిక మరమ్మతులతో సరి

◆ యాదమరి మండలం చిత్తూరు–గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి నుంచి భూమిరెడ్డిపల్లెకు వెళ్లే మార్గంలో ఉన్న పెద్ద వాగు.. వర్షాలు కురిస్తే నీటి ఉద్ధృతికి పూర్తిగా రాకపోకలు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాగులో నీరు ప్రవహిస్తే భూమిరెడ్డిపల్లె, జన్నవాళ్లమిట్ట, వెంకటాపురం, అనంతపురం, లగడపాటూరు గ్రామస్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అదనంగా మరో మూడు కిలో మీటర్లు ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలి. ఇక్కడ పై వంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం.

◆ పూతలపట్టు–పెనుమూరు రోడ్డు పూతలపట్టు సమీపంలో ఉన్న భీమానదిపై ఉన్న వంతెన గత వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. వైకాపా ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా పరిశీలించి, వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల విడుదలకు హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా పోలవరం, సామనత్తం, అనంతాపురం, పంటపల్లె, పెనుమూరు, కలిగిరికొండ తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

న్యూస్‌టుడే, ఐరాల

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి.. ఈ పరిస్థితుల్లో పూతలపట్టు నియోజకవర్గంలోని గతంలో దెబ్బతిన్న వంతెనలతో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.. రెండున్నరేళ్ల క్రితం కొట్టుకుపోయిన వంతెనల స్థానంలో కొత్తవాటిని నిర్మిస్తామని గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా చేసిన ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి.. ఫలితంగా వర్షకాలంలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది.

ఐరాల-చిత్తూరు ప్రధాన రహదారిలోని ఐరాల సమీపంలో ఉన్న ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనపై వర్షం కురిస్తేచాలు.. పెద్దఎత్తున నీరు ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఐరాల నుంచి జిల్లా కేంద్రమైన చిత్తూరు వైపు ఉన్న ప్రాంతాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోతాయి. రోజుల తరబడి నీరు నిలిచిన సందర్భాలు అనేకం. ఈ సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం శూన్యం. ఇక్కడ నీరు ప్రవహించే సమయంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వంతెనపై నీరు ప్రవహిస్తున్న సమయంలో పూతలపట్టు మండలానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదాన్ని అంచనా వేయలేక కారులో వెళ్లడంతో కొట్టుకుపోయి మృతి చెందారు. అప్పట్లో అక్కడ పరిశీలించిన నాటి ఎమ్మెల్యే బాబు.. ఈ మార్గంలో పై వంతెన నిర్మించాలని, ఇందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఇచ్చిన ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం వర్షలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షాలు రాకముందే పనులు చేపట్టి ఉంటే సమస్య పరిష్కారమయ్యేదని అంటున్నారు. దీనిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం, అధికారులు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

పూతలపట్టు నియోజకవర్గంలో గతంలో వర్షాలకు కొట్టుకుపోయిన వంతెనల స్థానాల్లో కొత్తవాటి నిర్మాణాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ఐరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద పైవంతెన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశాం, నివేదికలు ప్రభుత్వానికి పంపాం. నిర్మాణాలకు అవసరమైన నిధుల కేటాయింపు జరిగిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. – కలికిరి మురళీమోహన్, ఎమ్మెల్యే, పూతలపట్టు

నేటి వరకు బియ్యం పంపిణీ గడువు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: బియ్యం కార్డుదారులకు అక్టోబరు నెల కోటా నిత్యావసర సరకుల పంపిణీ గడువును శుక్రవారం వరకు పొడిగిస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని జేసీ విద్యాధరి తెలిపారు. గురువారంతో గడువు ముగిసిందని, వర్షాల కారణంగా సరకుల పంపిణీలో జాప్యం చోటుచేసుకుందన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.

రాయితీపై సన్‌ఫ్లవర్ ఆయిల్..

పెరిగిన పామాయిల్ తదితర నూనెల ధరలు నియంత్రించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 34 కౌంటర్ల ద్వారా రాయితీపై లీటరు సన్‌ఫ్లవర్ రూ.124, పామాయిల్ రూ.110కే అందజేస్తోంది. పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో రైతుబజారు, రిలయన్స్, మోర్ సంస్థల దుకాణాలతో పాటు హోల్‌సేల్ దుకాణాల్లో విక్రయానికి వీలుగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక కౌంటర్లలో రాయితీ ఆయిల్ పొందదలచిన వినియోగదారులు విధిగా బియ్యం కార్డు నంబరు తెలియజేయాలని జేసీ విద్యాధరి పేర్కొన్నారు.

టెట్ పరీక్షకు 389 మంది హాజరు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: చిత్తూరులోని రెండు పరీక్షా కేంద్రాల్లో గురువారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 389 మంది హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 230 మందికిగానూ 194 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 230 మందికిగానూ 195 మంది పరీక్ష రాశారు.

కంప్యూటర్ మిథ్య



పుత్తూరు బాలికోన్నత పాఠశాలలో కంపూటర్లు(పాత చిత్రం)

పనిచేయని పరికరాలు ❖ పత్తా లేని బోధకులు
❖ పాఠశాలల్లో ఇదీ దుస్థితి

న్యూస్‌టుడే, పుత్తూరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం కంప్యూటర్ విద్యను అమల్లోకి తెచ్చింది.. ఎంతో ఉన్నత ఆశయంతో అమల్లోకి తెచ్చిన ఈ కంప్యూటర్ విద్యకు నిర్లక్ష్యపు వైరస్ సోకింది. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్లన్నీ మూలనపడ్డాయి.. ఎంతో ప్రజాధనాన్ని వెచ్చించి కొనుగోలు చేసిన ఇవి నిర్వీర్యమవుతున్నాయి.. అటు ఉపాధ్యాయులు కానీ, ఇటు అధికారులు గానీ వాటి గురించి పట్టించుకోకపోవడంతో పాఠశాలల్లో అవి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. గత దశాబ్ద కాలంగా వాటి బూజు దులిపే వారు కరవయ్యారు.

ఇదీ తీరు.. నగరి నియోజకవర్గంలో మొత్తం 42 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 34 ఉన్నత పాఠశాలలను సక్సెస్ పాఠశాలలుగా గుర్తించారు. వీటన్నింటిలో కంప్యూటర్ విద్యను అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్ణయించి ఒక్కో ఉన్నత పాఠశాలకు 11 కంప్యూటర్లు అందించారు. అయితే దీన్ని ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ప్రవేశ పెట్టిన మొదట్లో బోధకులను నియమించడంతో కొద్దికాలం సజావుగా సాగింది. బోధకులకు వేతనాలు సక్రమంగా ఇవ్వక వారు విధులకు దూరమయ్యారు. అప్పటి నుంచి కంప్యూటర్లు మూలనపడ్డాయి. గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను ఒకింత బాగుచేసినా కంప్యూటర్ విద్యను ప్రోత్సహించలేదు.

మూలనపడ్డ జనరేటర్లు

గతంలో కంప్యూటర్ ల్యాబ్‌లకు జనరేటర్లు అందించారు. రూ.కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసిన కంప్యూటర్లు, జనరేటర్లు మూలనపడ్డాయి. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా వాటి గురించి పట్టించుకోవడంలేదు.

ముగిసిన ఒప్పందంతో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు సంస్థతో కంప్యూటర్ విద్య గురించి కుదుర్చుకున్న ఒప్పందం 2013 సెప్టెంబరు 15తో ముగిసింది. అనంతరం విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడికి శిక్షణ ఇచ్చి వారితో కంప్యూటర్ విద్యపై శిక్షణ ఇచ్చి బోధన కొనసాగించాలని ప్రయత్నించారు. కానీ అది సఫలం కాలేదు. కాస్త కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులు ఆ దిశగా ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఉన్న కంప్యూటర్లు అటకెక్కాయి.

కొన్ని పాఠశాలల్లో వినియోగిస్తున్నారు..

గతంలో సక్సెస్ పాఠశాలలకు అందించిన కంప్యూటర్లు కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని వినియోగిస్తున్నారు. మరికొన్నిచోట్ల మూలనపడింది వాస్తవమే. వాటిని బాగు చేసి బోధనకు అనువుగా చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం.

– తిరుమలరాజు, ఎంఈవో, పుత్తూరు

గరుడ వాహనంపై వరదరాజుని విహారం



గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న వరదరాజస్వామి

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరదరాజస్వామి వారి ఆలయంలో పౌర్ణమి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారం చేసి గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ మండపంలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా గురువారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 22 కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి దాదాపు 10 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని ఆరు కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. బుధవారం శ్రీవారిని 75,371 మంది దర్శించుకోగా రూ.4.21 కోట్ల హుండీ కానుకలు లభించాయి.



శాంతిపురంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం

పీహెచ్‌సీల్లోనే గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు

- కేంద్ర సహకారంతో గ్రామాలకు విస్తరణ
- అనుసంధానంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు
- ఉమ్మడి జిల్లాలో రూ.8 కోట్లతో 16 భవనాలు

శాంతిపురం, న్యూస్‌టుడే: ప్రస్తుతం గర్భిణులు, బాలింతలకు వైద్యం అందాలంటే ఏరియా, జిల్లా వైద్యశాలలకు వెళ్లాల్సిందే. ఆ పరిస్థితిని మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లోనే వైద్యసేవల విస్తరణకు శ్రీకారం చుట్టాయి. వైద్యశాలలకు అనుసంధానంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు ఏర్పాటవుతున్నాయి. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 166 యూనిట్ల స్థాపనకు 2021- 22 ఆర్థిక సంవత్సరంలో ఎన్‌హెచ్‌ఎం- 15వ ఫైనాన్స్ నిధుల ద్వారా రూ.83 కోట్లను కేంద్రం కేటాయించింది.

ఉమ్మడి జిల్లాలో 16 చోట్ల సేవలు

చిత్తూరు జిల్లాలో శాంతిపురం, పాలసముద్రం, విజయపురం, తవణంపల్లె, ఐరాల, చౌడేపల్లె, బైరెడ్డిపల్లె, గుడిపాల, తిరుపతి జిల్లాలో బాలాయపల్లి, డక్కిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం, నాగలాపురం, పిచ్చాటూరు, పాకాల, వడమాలపేట పీహెచ్‌సీలకు బీపీహెచ్‌యూలు అందుబాటులోకి రానున్నాయి.

రూ.8 కోట్లతో భవనాలు

16 పీహెచ్‌సీలకు అనుబంధంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎనిమిది చొప్పున ఆస్పత్రుల్లో నూతన భవనాలు, వసతుల ఏర్పాటుకు ఒక్కో భవనానికి రూ.50 లక్షల చొప్పున రూ.8 కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధులతో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. పలు చోట్ల సిద్ధం కాగా.. కొన్ని చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య వసతులే లక్ష్యంగా బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు పెడుతున్నారు. పీహెచ్‌సీల్లో రోజుకు 150 నుంచి 200 వరకు ఓపీ నమోదవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు గర్భిణులు, బాలింతలకు సేవలు పూర్తి స్థాయిలో అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఏరియా, జిల్లా వైద్యశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ప్రసూతి నిపుణులు.. ఎంపిక చేసిన రోజుల్లో అక్కడ సేవలందిస్తారు. ప్రస్తుత వైద్యులు, విభాగాల నిర్వహణ, రోగుల నిరీక్షణ సౌకర్యవంతంగా గదుల వసతి లేని విషయాన్ని గుర్తించింది.

వసతులు ఇలా..

రోగుల నిరీక్షణ విశాలమైన హాలు, మందుల నిల్వకు ప్రత్యేక గది, కంప్యూటర్, రికార్డుల నిర్వహణ, భద్రత, రిసెప్షన్‌కు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. సిబ్బందితోపాటు రోగులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, మూత్రశాలల వసతి ఉంటుంది. సాధారణ రోగులతోపాటు క్షయ, లెప్రసీ బాధితుల వైద్యసేవల విస్తరణకు బీపీహెచ్ యూనిట్లు ఉపయోగపడనున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

వైభవంగా పౌర్ణమి గరుడసేవ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి ఏడు గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామివారు గరుడునిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనసేవలో పెద్దజీయర్, చిన్నజీయర్, తితిదే సీవీఎస్‌వో శ్రీధర్, ఎస్వీ సుబ్బారాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.


గరుడ వాహనంపై కొలువుదీరిన మలయప్పస్వామి →

పరిహారం మంజూరు

చిత్తూరు కలెక్టరేట్: పిడుగుపాటుతో మృతి చెందిన తండ్రి, ఇద్దరు కూతుళ్లకు సంబంధించి కుటుంబ సభ్యులకు రూ.12 లక్షల పరిహారాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వు జారీచేసింది. గంగవరం మండలానికి చెందిన రామకృష్ణ, ఆతడి కుమార్తెలు రమాదేవి, మీనాకుమారి.. పిడుగుపాటుకు గురై 2020 మే 30న మృతి చెందారు. దీనిపై అప్పటి కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. మృతిచెందిన ఒక్కొక్కరికీ రూ.4 లక్షల చొప్పున మొత్తం రూ.12 లక్షల ఎక్స్‌గ్రేషియాను కుటుంబ సభ్యులకు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రాయితీ విత్తన ధరల ఖరారు

చిత్తూరు (వ్యవసాయం) : రబీ సీజన్‌కు సంబంధించి రాయితీపై వేరుసెనగ, ఉద్దులు, పెసలు విత్తనాలను జిల్లా వ్యవసాయ శాఖ అందజేస్తోంది. నగరి, విజయపురం, నింద్ర మండలాలకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం జిల్లాకు ఉద్దులు విత్తనాలు 40 క్వింటాళ్లు, పెసలు విత్తనాలు 30 క్వింటాళ్లు, నువ్వులు 14 క్వింటాళ్లు, వేరుసెనగ విత్తు 1651 క్వింటాళ్లు కేటాయించింది. ప్రస్తుతం ఉద్దులు, పెసలు, నువ్వుల విత్తన ధరలు ఖరారు కాగా.. వేరుసెనగ విత్తు ధర ఖరారు కావాల్సి ఉంది. త్వరలో రాయితీ విత్తనాలు ఏపీ విత్తన సంస్థ ద్వారా మండలాలకు సరఫరా చేసి రైతులకు అందజేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ గురువారం తెలిపారు.

విత్తు ధరలు, రాయితీ వివరాలిలా.. (క్వింటా, రూ.ల్లో)

విత్తనం	ధర	రాయితీ	రైతువాటా
ఉద్దులు	14 వేలు	4,200	9,800
పెసలు	13 వేలు	3,900	9,100
నువ్వులు	17 వేలు	6,800	10,200

అప్రమత్తమై పంటలు కాపాడుకోవాలి


పెరుమాళ్లపల్లిలో వరి పంట పరిశీలిస్తున్న వనరుల కేంద్రం సమన్వయకర్త సంధ్యారాణి

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: తుపాను ప్రభావంతో జిల్లాలో కురిసిన వర్షాలకు పలు మండలాల్లో వరి, వేరుసెనగ తదితర పంటలు దెబ్బతిన్నాయని, రైతులు అప్రమత్తమై జాగ్రత్తలు పాటిస్తే పంటలు కాపాడుకుని నష్టాన్ని దూరం చేయవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఇన్‌ఛార్జి డీడీ నాగమల్లిక, జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త సంధ్యారాణి పేర్కొన్నారు. చిత్తూరు, పెనుమూరు తదితర మండలాల్లో గురువారం వారు పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న వరి, వేరుసెనగ పంటలు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. వర్షాల సమయంలో వరి కోతలు చేపట్టవద్దని, వాన నీరు పొలంలో ఉండకుండా చూడాలన్నారు. కంది పొలాల్లో వర్షపు నీటిని పొలం నుంచి బయటకు తీసేయాలని, వర్షాలు ఆగిన తర్వాత కందికి తెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో పద్మజ, అధికారులు పాల్గొన్నారు.

మమ్మల్ని గుర్తించండి

- వృథాగా మూలన వాహనాలు
- జగన్ పాలన నిర్లక్ష్యానికి నిరుపయోగంగా


యంత్రాలను కప్పేసిన కంప

కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రజావసరాల కోసం కొనుగోలు చేసిన వాహనాలు, యంత్రాలు ఒక్కరోజు కూడా వినియోగించకుండానే మూలన చేరాయి. దీంతో చిత్తూరు కలెక్టరేట్ ప్రాంగణంలో వివిధ రకాల వాహనాలు, యంత్రాలు వృథాగా ఉంటున్నాయి. దీంతో వీటిని వృథాగా మొక్కలు కప్పేయడంతో ఆ ప్రాంత అడవిని తలపిస్తూ వాహనాలు కనిపించడం లేదు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ కింద గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు మినీ జేసీబీ, మినీ హిటాచీ, ఆటోలు కొనుగోలు చేశారు. ఆయా గ్రామాల్లోని యువతకు ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ కింద వీటిని అందించి వేతనం ఇవ్వాలని అప్పటి ప్రభుత్వం సంకల్పించింది. తీరా ఎన్నికల సమయంలో వాహనాలు రావటం, ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో వీటిని అప్పట్లో పంపిణీ చేయలేదు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అప్పటి నుంచి నేటి వరకు అవి వృథాగా పడిఉన్నాయి. ఐదేళ్ల వైకాపా పాలనలో వీటిని వినియోగంలోకి తెచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో అవి ఎందుకు పనికిరాకుండా పోయాయి. కొన్ని వాహనాల పరికరాలు, టైర్లు దొంగిలించబడ్డాయి. స్వచ్ఛభారత్‌లో భాగంగా వీటిని వినియోగించి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రస్తుత అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాల్సి ఉంది.

- ఈనాడు, చిత్తూరు


వృథాగా స్వచ్ఛ ఆటోలు



ఎంపికైన మహిళల జట్టు


పురుషుల జట్టు

జేఎన్‌టీయూఏ కబడ్డీ జట్ల ఎంపిక

చిత్తూరు(క్రీడలు) : జేఎన్‌టీయూఏ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు ఐదు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఎంపిక పోటీల్ని నిర్వహించి.. మహిళల విభాగంలో 12 మంది, పురుషుల విభాగంలో 12 మందితో తుది జట్లు ఖరారు చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 30 నుంచి చెన్నైలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో జరిగే దక్షిణాది అంతర విశ్వవిద్యాలయాల టోర్నీలో తలపడనున్నాయని కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు, జేఎన్‌టీయూఏ క్రీడల బోర్డు కార్యదర్శి జీబీరెడ్డి తెలిపారు. పీడీలు సుబ్రహ్మణ్యంరెడ్డి, మణి పాల్గొన్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్టు ..

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 19న ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత వాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలబాలికల విభాగంలో జరిగే ఈ పోటీలకు అర్హులైన క్రీడాకారులను తీసుకొచ్చే పీడీ, పీఈటీలు ఫారం-బీ తీసుకురావాలని సూచించారు. క్రీడాకారుల్లో ఇంటర్ విద్యార్థులుంటే పదో తరగతి మార్కుల జాబితా, ప్రస్తుతం చదువుచున్న కాలేజీ స్టడీ సర్టిఫికెట్ జతపరచాలని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జట్టు ఈ నెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో చిత్తూరు జిల్లా తరపున తలపడనున్నట్లు వివరించారు.

విద్యుత్తు లైన్లు క్షుణ్ణంగా పరిశీలించండి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్లు క్షుణ్ణంగా పరిశీలించాలని, పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లు సత్వరమే పరిష్కరించుకోకపోతే వేతనాల్లో కోత విధిస్తామని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఈఈలు, డీఈఈలు, ఏఈలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్తు లైన్లు క్షుణ్ణంగా పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న లైన్లు, స్తంభాలు వెంటనే మార్పు చేయాలన్నారు. సరఫరాలో అంతరాయాలు రాకూడదని, నియంత్రికల ఫెయిల్యూర్లు బాగా తగ్గించాలని చెప్పారు. ప్రస్తావనకు వచ్చిన సమస్యలు నిర్దేశిత రోజుల్లో పరిష్కరించాలన్నారు. వ్యవసాయ, గృహ, వాణిజ్య సర్వీసుల జారీలో జాప్యం చేయరాదని చెప్పారు. వంద శాతం బిల్లుల వసూలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెండింగ్ వర్క్‌ఆర్డర్ల పరిష్కారం బాధ్యత ఆయా ప్రాంతాల డీఈఈలదేనని స్పష్టం చేశారు. ఈఈ మునిచంద్ర, డీఈఈలు, ఏఈలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


వీడియో సమావేశానికి హాజరైన ఈఈ మునిచంద్ర, డీఈఈలు, ఏఈలు

ఈఈ మెరిట్ పరీక్షకు రిజిస్ట్రేషన్లు

చిత్తూరు విద్య: ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ నిర్వహించే రాష్ట్ర స్థాయి ఈఈ మెరిట్ పరీక్ష కోసం విద్యార్థులు నవంబర్ నాలుగో తేదీ లోగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని డీఈవో దేవరాజులు గురువారం తెలిపారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా డీవైఈవోలు, ఎంఈవోలు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

జడ్పీ ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించాలి


వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న సీఈవో రవికుమార్‌నాయుడు

చిత్తూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న మినిస్టీరియల్ ఉద్యోగులకు.. ఉద్యోగోన్నతి కల్పించాలని కోరుతూ.. గురువారం సీఈవో రవికుమార్‌నాయుడికి వినతిపత్రాన్ని అందజేశారు. కొన్నేళ్లుగా అటెండర్, జూనియర్ సహాయకులు, సీనియర్ సహాయకులు ఉద్యోగోన్నతులు లేకుండా ఆ పోస్టుల్లోనే పనిచేస్తున్నారన్నారు. పలు ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నాయని, తమకు అవకాశం కల్పించి అక్కడ నియమించాలన్నారు. పరిశీలించి న్యాయం చేస్తానని సీఈవో హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంఘ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నలుగురి ఆత్మహత్యపై సీఐ విచారణ

జీడీనెల్లూరు: బెట్టింగ్‌కు కారణమై జీడీనెల్లూరుకు చెందిన ఒకే కుటుంబంలో ఈ నెల ఆరున నలుగురు ఆత్మహత్య పాల్పడిన కేసుపై సీఐ లక్ష్మీనారాయణ ప్రత్యేక విచారణ చేపట్టారు. ఈ ఘటనలో నాగరాజులరెడ్డి(60) అతడి భార్య జయంతి(50), కుమార్తె సునీత(26), కుమారుడు దినేష్(22) చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు దినేష్ ఆడిన ఆన్‌లైన్ గేమ్, క్రికెట్ బెట్టింగ్ కారణమని తెలుసుకున్న ఆయన విచారణ కొనసాగిస్తున్నారు. దినేష్‌కు అప్పు ఇచ్చిన వారిలో ఎవరైనా అతనిపై ఒత్తిడి, బెదిరించారా?, బుకీలు ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో రహస్య విచారణ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అతడి స్నేహితులను, బుకీలుగా భావిస్తున్న వారిని స్టేషన్‌కు రప్పించి, వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. సీఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దినేష్ సెల్‌ఫోన్ లాక్‌ను తొలగిస్తే.. మరిన్ని విషయాలు తెలుస్తాయన్నారు. దీనిపై నిపుణులను సంప్రదిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ


విజయ శంకర్‌రెడ్డి

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఉన్న జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడి(ఏడీ)గా విజయశంకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన డిప్యూటేషన్‌పై జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా పనిచేస్తూ.. మాతృశాఖకు బదిలీ అయ్యారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నూతన సాగు పద్ధతులు విస్తరించి అన్నదాతల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

స్విమ్స్‌లో రాయితీపై క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ ఆసుపత్రిలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు రాయితీపై మమోగ్రామ్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు ఎంఎస్ డా.రామ్ పేర్కొన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవాల సందర్భంగా స్విమ్స్ ఆంకాలజీ, రేడియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల మహిళా వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. 40 ఏళ్లకు పైబడిన మహిళలు పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెస్సీ స్పాట్ ప్రవేశాలు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్‌లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్.బిట్ల ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లు, ర్యాంక్ కార్డుతో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు హాజరుకావాలని కోరారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన వివాహిత పట్ల స్థానిక ఎంసీఆర్ నగర్‌కు చెందిన మధుసూదన్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త పని మీద వేరే ఊరు వెళ్లారని.. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్నట్లు గమనించిన అతను నిత్యం వెంటపడుతూ.. అసభ్యంగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఇంటి వరకు వెంటపడి వచ్చాడని.. ఇంటి యజమాని చూసి కేకలు వేయడంతో పారిపోయాడని తెలిపారు. పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


కిరణ్ (పాత చిత్రం)

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన ఓ యువకుడు క్షణికావేశంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన కుప్పంలో గురువారం చోటుచేసుకుంది. పురపాలక పరిధిలోని గుల్లేపల్లె వద్ద బెంగళూరు-చెన్నై ప్రధాన రైల్వే మార్గంలో యువకుడి మృతదేహం గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించగా వివరాలు వెలుగులోకి వచ్చాయి. గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లె గ్రామానికి చెందిన ఆనంద్ కుమారుడు కిరణ్(18) తిరుపతిలో సంగీత కళాకారుడిగా శిక్షణ తీసుకుంటూ దసరా పండగ రోజు ఇంటికి వచ్చారు. పండగ తర్వాత కూడా తిరుపతి వెళ్లకపోవడంతో తండ్రి బుధవారం సాయంత్రం మందలించారు. వెంటనే యువకుడు ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం రైల్వేపట్టాలపై బలవన్మరణానికి పాల్పడి ఉండటంతో ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి, రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	151
లేయర్	120
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	249
లేయర్ మాంసం	204

కార్ల దొంగల అరెస్టు

గుడిపాల, న్యూస్‌టుడే: వాహనాలను దొంగిలించే ముఠాను అరెస్టు చేశామని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ గురువారం తెలిపారు. స్థానిక స్టేషన్‌లో చోరీ, నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గత నెల 27న పసుమంద గ్రామం వద్ద కారు చోరీ విషయమై కేసు నమోదు చేశామని చెప్పారు. గురువారం మండలంలోని కమ్మతిమ్మయ్యపల్లె క్రాస్ వద్ద నిందితులు చిత్తూరుకు చెందిన షఫీ, జావిత్, షాబుద్దీన్, రాజేష్ ఖన్నా, ఆసిఫ్ బేగ్‌ను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి కారు, రెండు టాటా ఏస్ వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్సై రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.


నిందితులను చూపుతున్న డీఎస్పీ సాయినాథ్ తదితరులు

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

ద్విచక్రవాహనం, ఆటోలు, కత్తులు స్వాధీనం

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: వైజాగ్ ఏజెన్సీ నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని.. పొట్లాలుగా మార్పు చేసి చిత్తూరులో విక్రయిస్తున్న వారిపై పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రెండు ఆటోలు, ఓ ద్విచక్ర వాహనం, ఐదు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సాయినాథ్ నిందితులను చూపి నేరాల వివరాలు వెల్లడించారు. చిత్తూరులో గంజాయి విక్రయాలపై సమాచారం ఉండటంతో సీఐ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. సీఐ తన బృందంతో కలిసి కొద్దికాలం నుంచి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా ఉంచారు. బుధవారం రాత్రి పక్కా సమాచారంతో సీఐ నెట్టికంఠయ్య, ఎస్సై ప్రసాద్.. తమ బృందంతో కలిసి ఇరువారంలోని ఇండియన్ గ్యాస్ గోదాము వెనుక దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న సెల్వం అలియాస్ జఫోట్, జాషువా, లోకేష్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 1.6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని రవాణా కోసం వినియోగించిన రెండు ఆటోలు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా, విక్రయాల సమయంలో ఎవ్వరైనా అడ్డుపడితే.. బెదిరించడానికి వినియోగించిన ఐదు పొడవాటి కత్తులు కూడా స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన అల్లాబకాష్, వైఎస్ కాలనీకి చెందిన సిద్దు.. వైజాగ్ నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని, స్థానికంగా విక్రయిస్తారని, మరి కొందరు కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ వివరించారు. గంజాయి దిగుమతి చేసుకుని, విక్రయిస్తున్న అల్లాబకాష్, సిద్దు, మోహన్, సురేష్, తులసీ పరారీలో ఉన్నారని, త్వరలోనే వారినీ అరెస్టు చేస్తామన్నారు. ఈ కేసులో చురుగ్గా పాల్గొన్న సీఐ, ఎస్సై, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.


నిందితులను అరెస్టు చేసి, నేర వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయినాథ్


స్వాధీనం చేసుకున్న కత్తులు

తప్పొప్పులు సరిదిద్దండి.. జీడీనెల్లూరు: గత ప్రభుత్వ పాలనలో రీసర్వేలో చేపట్టిన తప్పొప్పులు సరిదిద్దాలని తహసీల్దారు చంద్రశేఖర్ సర్వేయర్లు, వీఆర్వోలను ఆదేశించారు. గురువారం ఆయన కార్యాలయంలో వారితో సమావేశమై, గతంలో చేపట్టిన రీసర్వేలో అనుమానాలు ఉన్నట్లు ప్రజల నుంచి చాలా అర్జీలు వచ్చినట్లు చెప్పారు. దీనిపై ముందస్తు దండోరా ద్వారా గ్రామసభ నిర్వహించి, రైతుల అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌భాషా, సర్వేయరు సునీత, రీసర్వే డీటీ ఖాదర్, ఆర్ఐ ఏకాంబరం పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ప్రగతి.. కార్వేటినగరం: పరిసరాల శుభ్రతతోనే ప్రగతి సాధ్యమవుతుందని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. మండలంలోని 22 పంచాయతీల్లో సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యదర్శులు నాగరత్నమ్మ, గోపి, లోకేష్ పాల్గొన్నారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ఎమ్మెల్యే పరామర్శ.. పుత్తూరు: తడుకు పంచాయతీ పరిధిలోని తిమ్మరాజుకండ్రిగ గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు రాజేంద్రరాజు(75) అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబసభ్యులను గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరామర్శించారు. రాజేంద్రరాజు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. సర్పంచి వెంకటేష్, తెదేపా నాయకులు ఆదిమండడి ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: స్థానిక ఓటిచెరువులో నివాసాల ఎదుట మురుగునీటి నిల్వ కారణంగా దోమలు, దుర్వాసన ఎక్కువగా ఉంది. **-స్థానికులు**

సమాధానం: ఓటి చెరువులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం.

-అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

గుంత పూడ్చివేత

స్పందనకు వందనం

మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో పానాటూరు గ్రామ సమీపంలో ఏర్పడిన గుంతను ఆర్అండ్‌బీ అధికారులు పూడ్చివేశారు. బుధవారం 'ఈనాడు'లో.. 'ఆర్అండ్‌బీ రోడ్డులో గుంతను పూడ్చాలి' శీర్షికన 'మేమున్నాం.. మీకుతోడుగా'లో ప్రచురితమైంది. దీనిపై ఆర్అండ్‌బీ డీఈఈ దస్తగిరి స్పందించి జేసీబీ సాయంతో గుంత పూడ్చివేయించారు.

-న్యూస్‌టుడే, గుడిపాల

రాష్ట్ర ప్రగతి మార్చేలా ఆరు పాలసీలు


గురజాల జగన్మోహన్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధితో పాటు పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఈ పాలసీలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తాయన్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఏపీ బ్రాండ్ తిరిగి సాధించడం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పారిశ్రామిక అభివృద్ధి, ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ, ఆహార శుద్ధి, ఎలక్ట్రానిక్స్, ప్రైవేట్ పార్కుల విధానం, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ వంటి ఆరు పాలసీలతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కు కేటాయించడం ఆహ్వానించదగ్గ అంశమన్నారు. ఇండస్ట్రియల్ పార్కులతో నియోజకవర్గ స్థాయిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని, చెన్నై బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు అనుసంధానంగా ఇండస్ట్రియల్ క్లస్టర్ అభివృద్ధి చేయడం చిత్తూరు జిల్లాకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

అన్నాడీఎంకే ఆవిర్భావ దినోత్సవం


పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: అన్నాడీఎంకే పార్టీ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం చిత్తూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంజీఆర్ కూడలి వద్ద తమిళనాడు దివంగత మాజీ సీఎంలు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నాడీఎంకే పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర ఉప కార్యదర్శి ఎస్ఏ రవూఫ్ బక్కర్, నాయకుడు సుబ్రహ్మణ్యం, జయకుమార్ రాజా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కలగా.. వసతుల కల్పన

☛ అభివృద్ధికి నోచుకోని వీధులు ☛ అవస్థల్లో నగరవాసులు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

పేరుకేమో నగరపాలక సంస్థ.. ఆపై జిల్లా కేంద్రం.. ఉన్నతాధికారులు అందరూ ఇక్కడే కొలువుదీరారు.. నిత్యం నగర రహదారులు.. కాలనీలన్నీ చూస్తునే ఉంటారు.. పట్టుమని పాతిక కిలోమీటర్ల విస్తీర్ణంలో లేదు ఈ నగరం.. పుష్కర కాలం క్రితం విలీనమైన గ్రామాలను కలుపుకొని నగరపాలక సంస్థ ఆవిర్భవించినా చిన్నపాటి సౌకర్యాలు కల్పించలేని దయనీయ స్థితి.. అధికారులు వస్తున్నారు.. పోతున్నారు.. సమస్యలు పరిష్కారం కావడం లేదు.. నిత్యం కాలనీల్లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తామని ఇస్తున్న హామీలు నానాటికీ వెక్కిరిస్తున్నాయి.. ఫలితంగా నగరవాసుల తిప్పలు చెప్పనలవికావు.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా తమ సమస్యలకు మోక్షం లభిస్తుందని కాలనీలవాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సౌకర్యాలు ఎన్నటికో..?

నగర శివారు ప్రాంతంలోని 47వ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఈ కాలనీల్లో కాలువలు, రహదారులు, పారిశుద్ధ్య లోపం కారణంగా స్థానికులు సమస్యల నడుమ జీవిస్తున్నారు. పేదలు నివసించే ఈ ప్రాంతంలో వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఈ కాలనీలు అటవీ సమీప ప్రాంతాలను తలపిస్తున్నాయి. మంగసముద్రం హౌసింగ్ కాలనీ గ్రామ పంచాయతీలో ఉన్న లెనిన్‌నగర్ కాలనీ, పంత్రాంపల్లె గ్రామాలను 2012లో నగరపాలక సంస్థలో విలీనం చేసి వీటిని 47వ డివిజన్ పరిధిలో చేర్చారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టలేదు. నగరంలోని పేదలకు ఈ కాలనీల్లో ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినా సౌకర్యాలు కల్పించలేదు. ఫలితంగా డివిజన్ పరిధిలో దాదాపు వెయ్యిమందికి పైగా ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు.


వైఎస్‌కాలనీలో రహదారి దుస్థితి

అన్నీ ఇబ్బందులే..

స్థానిక ప్రశాంత్‌నగర్ సమీపంలోని వై.ఎస్. కాలనీ, ఇందిరమ్మ కాలనీలో మౌలిక సదుపాయాల కొరతతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఇందిరమ్మ గృహాలు వందలో సంఖ్యలో ఉన్నా అభివృద్ధికి నోచుకోలేదు. నగర శివారు ప్రాంతమైన ఈ కాలనీని నగరపాలక సంస్థ పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అధ్వాన మట్టిరోడ్లలో వాహనాల ప్రయాణం దుర్భేద్యమైంది. వీధిదీపాలు ఉన్నా సక్రమంగా వెలగని కారణంగా ఇళ్ల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో రాత్రివేళ విషపురుగుల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో నివాసాల ఎదుట చిన్నపాటి గుంతల్లో మురుగునీరు నిలుస్తోంది. దీంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉందని కాలనీ వాసులు చెబుతున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మహిళలు తెలిపారు. ఈ కాలనీలో అధ్వాన పారిశుద్ధ్యంతో పిల్లలకు జ్వరాలు వస్తున్నాయని, పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఆరోపిస్తున్నారు. వై.ఎస్, ఇందిరమ్మ కాలనీల్లో సదుపాయాల కల్పనలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపించారు.


మంగసముద్రం హౌసింగ్ కాలనీలో నివాసాల ఎదుట మురుగు గుంత

టెండర్లు పిలిచాం..

శివారు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు టెండర్లు పిలిచాం. 15వ ఆర్థిక సంఘం నిధులతో త్వరలో పనులు చేపట్టి పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. **-నరసింహప్రసాద్, కమిషనర్, నగరపాలక సంస్థ**


సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో పార్వతి

డీపీవో ఆకస్మిక తనిఖీ

తవణంపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అరగొండ సచివాలయంలో జిల్లా పంచాయతీ అధికారిణి పార్వతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డుల్ని, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అరగొండ ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించి, అక్కడ జరుగుతున్న కార్యక్రమాల్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరచాలని ఆదేశించారు. ఆమె వెంట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటా

విజయపురం, న్యూస్‌టుడే: అధైర్య పడకండి.. అండగా ఉంటానని మాజీ మంత్రి రోజా పేర్కొన్నారు. జగన్నాథపురంలో బాలాజీ కుంటుంబాన్ని, మహారాజపురంలో ఎంపీటీసీ శివకుమార్ కుటుంబాన్ని, కాళికాపురంలో రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఆమె భరోసా ఇచ్చారు. వైకాపా మండల అధ్యక్షుడు గోపీనాథ్, వైస్ ఎంపీపీ మంజుబాలాజీ, గుణశేఖర్‌రెడ్డి, రవినాయుడు, సతీష్ యాదవ్, పరంధామ యాదవ్ తదితరులు ఆమె వెంట ఉన్నారు. **నిండ్ర, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని నెట్టేరి గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు హేమాద్రి తల్లి కృష్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. ఎంపీపీ దీప, పార్టీ మండల కన్వీనర్ వేణుగోపాల్‌రాజు, నాయకులు బాబురెడ్డి, అనీల్‌కుమార్, శ్యాంలాల్, మేరీ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే పంచాయతీల అభివృద్ధి


తవణంపల్లె: కొండ్రాజుకాలువలో రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

విజయపురం, న్యూస్‌టుడే: పంచాయతీల అభివృద్ధి కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని ఎమ్మెల్యే గాలిభానుప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని కోసలనగరంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.12లక్షల విలువ చేసే సిమెంటు రోడ్డుకు ఆయన గురువారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, జిల్లాల మార్పులు జరిగినప్పుడు ఇది సాధ్యమన్నారు. విజయపురం అభివృద్ధికి కోసలనగరంలో ఏపీఐఐసీ కేటాయించిన భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, భూములకు విలువలు వచ్చేలా ఇండస్ట్రియల్ పార్కు తెప్పిస్తామని హామీ ఇచ్చారు. తద్వారా యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఎంపీడీవో రమణప్రకాష్, పీఆర్ ఏఈ వీరభద్రం, సీఐ భాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ రాజు, ప్రధాన కార్యదర్శి బాబునాయుడు, బాలసుబ్రహ్మణ్యంరాజు, చిన్నబ్బరాజు, దశరథరాజు, నారాయణరాజు, సుదర్శనరాజు, గుణభూషణమ్మ, మునిశేఖర్‌రాజు పాల్గొన్నారు. **పూతలపట్టు:** ప్రతి గ్రామంలో కూటమి ప్రభుత్వ మార్క్ ఉండేలా సీఎం చంద్రబాబు సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పేర్కొన్నారు. గాంధీపల్లి, వజ్జిరెడ్డిపల్లి, సామనత్తం, ఎర్రపరెడ్డిపల్లి, ఆకనంబట్టు, గొడుగుచింత, నారాయణరెడ్డిపల్లి, గొల్లపల్లి, కాంబిల్లి గ్రామాల్లో రూ.60లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్ల, అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన, భూమిపూజ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, నాయకులు చంద్రమౌళి, మురళి, గంగాధర గుప్త, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు. **తవణంపల్లె:** ఎమ్మెల్యే మురళీమోహన్.. జోగివారిపల్లి, టి.పుత్తూరు, గురుకులవారిపల్లె, ఈసనెల, కొండ్రాజుకాలువ గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సర్పంచి పరంధామనాయుడు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రెడ్డిబాబు, ఏపీవో లలిత, తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్‌రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మండల అధ్యక్షుడు దిలీప్, గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యులు వెంకటేశ్వరచౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు సునీల్‌కుమార్, మోహన్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ బాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.


విజయపురం: కోసలనగరంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

బాలవికాస్ కేంద్రాల్లో శిక్షణ ప్రారంభం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: పిల్లలు సత్ప్రవర్తనతో మెలగాలని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం తెలిపారు. స్థానిక సంతపేట విజయలక్ష్మీ నగర్ కాలనీలోని శ్రీ విద్యా గణపతి ఆలయంలో బాలవికాస్ శిక్షణ తరగతుల్ని గురువారం ప్రారంభించారు. మానవతా విలువలు, సమయపాలన, నీతికథల బోధన, సంగీతం, ధ్యానం, పరిశుభ్రత అంశాలపై పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవరాజులు, గజేంద్ర, అమర్‌నాథ్, శంకర్, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నీతి కథ బోధిస్తున్న శిక్షకుడు దేవరాజులు

ఆసుపత్రికి సామగ్రి వితరణ

నగరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన చక్రాల కుర్చీలు, స్ట్రెచర్లు గురువారం అందజేశామని సిరీస్ట్ మానసిక దివ్యాంగుల పాఠశాల కార్యదర్శి గిరిజ తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని వితరణగా అందించినందుకు డాక్టర్ కార్తికేయన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది, సిరీస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.


చక్రాల కుర్చీలు, స్టాండ్లు అందజేస్తున్న ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ

చిత్తూరు(సంతపేట): పౌర్ణమి సందర్భంగా గిరింపేటలో సత్యసాయి పల్లకి సేవను గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు సాయి కీర్తనల్ని ఆలపిస్తూ భజనలు చేశారు.


పల్లకిలో విహరిస్తున్న సత్యసాయి

అగ్గిరిలో..తవణంపల్లె: అగ్గిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణతో పాటు ఆంజనేయ సుదర్శన హోమాన్ని నిర్వహించారు. రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవం, భక్తులకు అన్నదానం చేశారు. చెక్కు భజనలు, హరికథా కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో హనుమంతరావు పాల్గొన్నారు.


వేపగుంటలో పాల్గొన్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఉపాధి నిధులతో పల్లెలకు మహర్దశ

పుత్తూరు, వడమాలపేట, న్యూస్‌టుడే: ఉపాధి హామీ నిధులతో పల్లెలకు మహర్దశ కలగనుందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. వేపగుంట, శిరుగురాజాపాలెంలో పల్లెపండుగలో భాగంగా జరిగిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.10 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఒక్క పుత్తూరు మండలంలోనే 61 పనులు రూ.2కోట్లుతో చేపడుతున్నట్లు చెప్పారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఏపీవో భార్గవి, గ్రామస్థులు పాల్గొన్నారు.
* వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్‌పురంలో జరిగిన పల్లెపండుగలో తుడా మాజీ డైరెక్టర్ ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో భూమిపూజ జరిగింది. తెదేపా నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిశీలన


నగరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పద్మావతినగర్‌లో ప్రజా సమస్యలను మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, అధికారులు గురువారం పరిశీలించారు. తెదేపా నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వార్డుబాట కార్యక్రమంలో, ప్రజలు మురుగు కాలువల సమస్య, వీధిదీపాలు లేవని, తాగునీటి సమస్యను అధికారులకు విన్నవించారు. 25, 26 వార్డుల్లో కనీస వసతుల కల్పించాలని, దోమల బెడద అధికంగా ఉందని తెలిపారు. పరిశీలించిన అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి నాయుడు, కృష్ణారెడ్డి, గుణశేఖర్, రాజు, మునిరత్నం, మణి, బాబు, ఆశోక్ పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్, తెదేపా నాయకులు

అసౌకర్యాలకు నిలయంగా

చిత్తూరు నగరంలోని గంగినేని చెరువు పరిసర ప్రాంతాలు పాదచారులకు ఆహ్లాదకరంగా మారాయి. చెరువు వెంట పాదచారులకు ప్రత్యేకమైన కాలిబాట ఏర్పాటు చేశారు. వ్యాయామం కోసం అక్కడికి వచ్చిన ప్రజలు సేద తీరేందుకు సిమెంటు బల్లలు ఏర్పాటు చేశారు. అయితే అవి ముళ్లపొదలతో నిండిపోయాయి. పరిసరాలు వ్యర్థ మొక్కలతో దర్శనమిస్తున్నాయి. రోడ్డు మధ్యలో గొయ్యి పడటంతో వాహన చోదకులు ఇబ్బందులు గురవుతున్నారు. నగరపాలిక సంస్థ అధికారులు మరమ్మతులపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. **-ఈనాడు, చిత్తూరు**


రోడ్డు మధ్యలో దుస్థితి


సేదతీరే ప్రాంతంలో ముళ్ల పొదలు


బొమ్మలు ఇలా ధ్వంసం

బరిలో దిగితే పతకమే

◗ అందివచ్చిన ప్రోత్సాహం
◗ నిత్య సాధనతో రాణింపు

వడమాలపేట, న్యూస్‌టుడే: పల్లె సీమలో పుట్టిన క్రీడా ఆణిముత్యాలు వారు.. బరిలోకి దిగారంటే ప్రత్యర్థి జట్టు చిత్తు కావాల్సిందే.. తమకున్న అసాధారణ ప్రతిభతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు.. చదువు క్రీడలను ఏకకాలంలో సాగిస్తూ సహచర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు.. క్రీడలపై ఆసక్తితో రోజు శిక్షణ తీసుకుంటూ ఎక్కడ పోటీలు జరిగినా తమ సత్తా చాటుతున్నారు వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు.

ఇటీవల కృష్ణా జిల్లా నున్న ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ అండర్-17 గ్రీకో రోమన్ రెజ్లింగ్ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వడమాలపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పూడి శ్రావణ్‌కుమార్, ఉదయ్‌కుమార్ చక్కగా రాణించారు.


రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులు

ఈ నెల 22 నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో జాతీయ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు వీరు రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో పూడి శ్రావణ్‌కుమార్ 92 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని, ఉదయ్‌కుమార్ 71 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుని అందరి మన్ననలు పొందారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇప్పటికే అనేక బహుమతులు సాధించారు. ప్రధానోపాధ్యాయురాలు కరుణా నవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు వీరిని చక్కగా ప్రోత్సహిస్తున్నారు.

▪ జాతీయ స్థాయిలో రాణిస్తా..



రాష్ట్ర స్థాయిలో జరిగిన గ్రీకో రోమన్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించా. ఈ నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకం సాధిస్తా. నిత్యం రెండు గంటలు పాటు సాధన చేస్తున్నా. క్రీడాకారుల కోటా కింద పోలీసుశాఖలో ఉన్నతమైన ఉద్యోగం సాధించాలని ఉంది. **-శ్రావణ్‌కుమార్, పదో తరగతి**

▪ ప్రతిభ చూపుతా..



ప్రధానోపాధ్యాయురాలు కరుణా నవనీతం, పీడీ చంద్రశేఖర్‌రాజు ప్రోత్సాహం మరువలేనిది. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో తృతీయ బహుమతి సాధించా. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటేందుకు కృషి చేస్తున్నా. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటా.

-ఉదయ్‌కుమార్, పదో తరగతి



రథంపై ఊరేగుతున్న ద్రౌపదీదేవి

వైభవంగా ద్రౌపదీదేవి రథోత్సవం

కార్వేటినగరం, న్యూస్‌టుడే: శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో కుంభాభిషేకం వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ఆవరణలో గణపతి హోమం, గాయత్రీదేవి హోమం, మృత్యుంజయ హోమం, నవగ్రహ శాంతి హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ద్రౌపదీ సమేతుడైన అర్జునుడు రథంపై గ్రామవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సోమనాథ్, కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు బాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణదేవరాయల వర్ధంతి

పుత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక బలిజ సంఘం భవనంలో శ్రీకృష్ణదేవరాయలు 495 వర్ధంతి వేడుకలు గురువారం నిర్వహించారు. దేశంలో శ్రీకృష్ణదేవరాయలు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చిరస్థాయిగా ఉన్నాయన్నారు. ఆయన హయాంలో ఎన్నో చారిత్రక కట్టడాలు చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలాయన్నారు. బలిజ సంఘ అధ్యక్షుడు శివయ్య, నాయకులు గోపీ, కృష్ణయ్య, రాజేంద్ర, ప్రకాష్, రాయుడు, మునెయ్య, సత్య పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

సమాచారం పొందడం పౌరుల హక్కు

చిత్తూరు గ్రామీణ: ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచారం పొందడం పౌరుల హక్కని ఏవో వేణుగోపాల్ అన్నారు. తుమ్మింద పంచాయతీ కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వివిధ పథకాలకు సంబంధించిన సమాచారం కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత గడువులోగా అందిస్తామన్నారు.

ఉప్పు పిచికారీ చేయాలి

పెనుమూరు: నేల వాలిన వరి పంట మొలకెత్తకుండా ఉండేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం ఆయన ఉగ్రాణం పల్లె సమీపంలో రైతు శ్రీనివాసులురెడ్డి వరి పంట పరిశీలించారు. ఏవో సుహర్‌లత, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE V ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: TIRUPATI

O.S. No.141/2019

Corporation Bank- Tirupati
Amalgamated with Union Bank of India,
Rep. by its Senior Manager,
Beri Street Branch, Tirupati. ...Plaintiff

Vs

K. Rekha ...Defendant

SUIT SUMMONS TO THE DEFENDANT

K. Rekha @ Meda Rekha, D/o K.Bala Subramanyam, W/o. M. Mallikarjuna, Door No.1-158, Bazaar Street, Irala Village & post, Chittoor District.

Please take notice that the above suit filed by the plaintiff for recovery of loan amount of **Rs.69,951/-** against above Defendant under loan account PMMY. **A/c. No.DLS/01/16003, Dt.20-01-2016,** and the notice to the defendant is not served and the Hon'ble Court order substitute service of summons is posted for summons for your presence on 28-11-2024 before the above Hon'ble Court either in person or through your counsel at about 10.30 a.m., failing which the matter will be decided ex-partee.

Hearing Date: 28-11-2024

S.M. JHAN, B.A., LL.B ADVOCATE, TIRUPATI

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు



అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీశేషాద్రిస్వామి మూలవిగ్రహాలు

వేడుకగా పౌర్ణమి పూజలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక శ్రీశేషాద్రిస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి పూజలు వేడుకగా జరిగాయి. ఆలయంలో ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు చేశారు. ఆలయం వద్ద జానపద కళాకారులు కోలాటం, పండరిభజనలు ప్రదర్శించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. పట్నపల్లె శ్రీకల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది.

తెదేపాలో చేరిక.. రామకుప్పం: మండల పరిధిలోని పంద్యాలమడుగు పంచాయతీకి చెందిన వైకాపా సీనియర్ నేతలు తెదేపాలో చేరారు. గురువారం ఎస్. గొల్లపల్లిలో నాయకులు సోమారెడ్డి, శ్రీనివాసులు తదితరులు తెదేపాలో చేరారు. తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఆంజనేయరెడ్డి, మునస్వామి, చిన్నికృష్ణ, కృష్ణానాయక్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే:

సమస్య: చిక్కనపల్లెలో డైరెక్ట్ పంపింగ్‌తో తాగునీరు వృథా అవుతోంది. సింగిల్ ఫేజ్ మోటారుకు ట్యాంకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో రోడ్డుపై ప్రవహించి బురదమయంగా మారుతుంది. సరఫరా కనెక్షన్ ఇస్తే ఇబ్బంది ఉండదు.
- స్థానికులు, చిక్కనపల్లె

సమాధానం: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- లోకనాథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, బైరెడ్డిపల్లె

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే :

సమస్య: గోపిశెట్టిపల్లెలో కాలువలు, వీధుల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి.
- రమణ, గోపిశెట్టిపల్లె

సమాధానం: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- లీలామాధవి, ఎంపీడీవో**



పుంగనూరు: ఇందిరా కూడలిలో రోడ్డుపై ఎదురు చూస్తున్న ప్రయాణికులు

నీడ కరవు..

● రద్దీ ప్రాంతాల్లో కానరాని బస్సు షెల్టర్లు
● నియోజకవర్గ కేంద్రాల్లో పరిస్థితి దారుణం

రోడ్లపైనే పడిగాపులు



పలమనేరు: జాతీయ రహదారిలో బస్సుల కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

పుంగనూరు, పలమనేరు, న్యూస్‌టుడే: పురపాలక కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో బస్సు షెల్టర్లు లేకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్లపైనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఓవైపు మాడు పగిలే ఎండలు.. మరో వైపు పిలిస్తే పలికే వర్షాలు.. ఇలాంటి పరిస్థితిలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల పరిస్థితి వర్ణనాతీతం. బస్సు షెల్టర్లు లేని ప్రాంతాల్లోనూ.. షెల్టర్లు ఉన్న చోట ఇబ్బందులే. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. పట్టణాలు రోజురోజుకు విస్తరిస్తున్నా ఆ స్థాయిలో వసతులు సమకూరడం లేదు.

పట్టణాల్లో వసతులు మృగ్యం

పలమనేరు, కుప్పం, పుంగనూరు పట్టణాలు 10- 20కి లోమీటర్ల మేర విస్తరించాయి. అయినా వీటిలో ప్రధాన కూడళ్లలో ఒకటి, రెండు చోట్ల మినహా.. ఎక్కడా షెల్టర్లు లేవు. కూడలి చోట బస్సులు ఆపుతూ ప్రయాణికులను తరలిస్తున్నారు. ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల చోదకులు పోటీ పడుతున్నారు. ఆ ప్రాంతాల్లో షెల్టర్లు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్తు వంటి వసతుల కల్పనేదీనని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా ఈ వసతులు కల్పిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు

ఉద్యోగులు, విద్యార్థులకు ఇబ్బంది

ఉద్యోగులు తమ విధుల నిర్వహణకు, విద్యార్థులు కళాశాలలకు వెళ్లడానికి బస్‌స్టాప్‌లకు చేరుకొంటారు. అక్కడ షెల్టర్ లేకపోగా కనీసం కూర్చోవడానికి ఎలాంటి వసతులు లేవు. దీంతో ఎండైనా, వానైనా రోడ్డుపైనే ఉండాల్సి ఉంది. ఓపిక నశించి దుకాణాల వద్దకు వెళ్లి నిలబడితే వ్యాపారుల చీదరింపులు ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రయాణికుల ఆవేదన. మూత్ర విసర్జనకు ప్రజల అవస్థలు చెప్పనలవి కావు. ముఖ్యంగా విద్యార్థినులు, మహిళలు, చక్రెరవ్యాధిగ్రస్తుల పరిస్థితి దారుణం.

పుంగనూరులో ఇలా..

పట్టణంలోని ఎన్టీఆర్, అంబేడ్కర్, ఇందిరా, కొత్తఇండ్ల కూడలిలోని బస్సు షెల్టర్లు తొలగించారు. ట్యాంక్‌బండ్‌పై క్రిష్ణగిరి మార్గంలో బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. మదనపల్లె మార్గంలో అంబేడ్కర్ కూడలి, ఎన్టీఆర్ కూడలి, కొత్తఇండ్లు, తిరుపతి మార్గంలో కొత్తపేట, ఏఎంసీ ఆఫీసు, మేలుపట్ల, రామసముద్రం రోడ్డులో ట్యాంక్‌బండ్, ఎన్ఎస్‌పేట సర్కిల్, పలమనేరు మార్గంలో తూర్పుమొగశాల మలుపులో బస్సు షెల్టర్లు అత్యవసరం. సింగిరిగుంట మార్గంలోని షెల్టర్ పునర్నిర్మాణం చేయాలి. చౌడేపల్లె, మదనపల్లె, తూర్పుమొగశాల, ట్యాంక్‌బండ్‌పై నిత్యం అధికసంఖ్యలో ప్రయాణికులు వేచి ఉంటారు. ఈ ప్రాంతాల్లో చెన్నై, తిరుపతి, కడప, హైదరాబాద్, బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇళ్ల నుంచి ముందుగానే బయలుదేరుతారు.

పలమనేరులో దారుణం

పలమనేరు పట్టణంలో అంబేడ్కర్ కూడలి, గుడియాత్తం కూడలి, బైపాస్‌లో వైఎస్సార్ సర్కిల్ వద్ద బస్సు షెల్టర్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో అధికసంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. కుప్పం పట్టణంలోని ఏరియా ఆస్పత్రి కూడలిలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి. నిత్యం వందలాది రోగులు, సహాయకులు వస్తారు.

కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం

బస్సు షెల్టర్లు అవసరమైన ప్రాంతాలు గుర్తించాం. వాటి నిర్మాణానికి సంబంధించి అనుమతుల కోసం కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం. ప్రయాణికులకు వసతుల కల్పనలో తమ పరిధిలోని చర్యలు తీసుకుంటాం.

- మధుసూదనరెడ్డి (పుంగనూరు), రమణారెడ్డి (పలమనేరు), శ్రీనివాసరావు(కుప్పం) కమిషనర్లు

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు స్పందనం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంబీటీ రహదారిలో వీధి దీపాలను అధికారులు ఏర్పాటు చేశారు. దీపాలు కొన్ని వెలగటంలేదని 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్త మున్సిపల్ అధికారులు స్పందించి గురువారం చర్యలు చేపట్టారు.

సీసీ రోడ్లకు భూమిపూజ

గంగవరం: పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని డ్రైవర్స్‌కాలనీ, మన్నార్‌నాయనపల్లె గ్రామాల్లో సీసీ రోడ్లకు తెదేపా నాయకులు భూమి పూజ నిర్వహించారు. తెదేపా నాయకులు ఆనంద్, మాజీ సర్పంచ్ మురళి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గ్రామాల్లో అభివృద్ధి పరుగులు

రామకుప్పం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం అన్నారు. గురువారం మండలంలోని పంద్యాలమడుగు పంచాయతీ యస్ గొల్లపల్లెలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. గోకులం షెడ్ల నిర్మాణాలు ద్వారా పీడీ రవికుమార్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌తో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. బస్టాండ్ నుంచి గంగమ్మ గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి శ్రీకారం

శాంతిపురం : పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గుంజార్లపల్లె, తుమ్మిశి, కడపల్లె, మొరసనపల్లె, కర్లగట్ట పంచాయతీల్లో రూ. 2.49 కోట్ల అంచనాలతో మంజూరైన అభివృద్ధి పనుల నిర్మాణాలను ఆయన గురువారం ప్రారంభించారు. విశ్వనాథనాయుడు, జనార్దన్ రెడ్డి, చంద్ర ఎంపీడీఓ కుమార్, ఏపీఓ హనీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని ఇరికిపెంట, పాయలగుట్ట ఇర్లపల్లె, గురికివారిపల్లె, గట్టువారిపల్లె ఎస్సీకాలనీలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు పూజలు చేశారు.



శాంతిపురం: సీసీ రోడ్డు పనుల్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నాయకులు



కుప్పం: ఎస్టీల్లో చేర్చాలంటూ వినతిపత్రం అందిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



రామకుప్పంలో..



చౌడేపల్లె ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో..

ఘనంగా వాల్మీకి జయంతి

న్యూస్‌టుడే, బృందం: రామాయణం రచించిన మహనీయుడు, ఆదికవి వాల్మీకి మహర్షి చిరస్మరణీయుడని వక్తలు పేర్కొన్నారు. ఆయన జయంతిని మూడు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూజలు చేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, కడా పీడీ వికాస్ మర్మత్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేశారు.



బేలుపల్లెలో ఊరేగింపు




పుంగనూరులో..



గంగవరం మండలం పత్తికొండలో..



పలమనేరులో..



మరుగుదొడ్లు శిథిలం.. చిన్నారులకు అవస్థలు

మండలంలోని బీసుగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నె గ్రామంలోని గిరిజన సాంఘిక సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో బాల, బాలికలు చదువుతున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. నీటి గొట్టాలు, కుళాయిలు, తలుపులు మరమ్మతులకు గురయ్యాయి. అందులోకి వెళ్లేందుకు మరొకరు బయట కాపలా ఉండాల్సిన దుస్థితి. వెంటనే మరమ్మతులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. నిధులు రాగానే పనులు చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

నేటి నుంచి డీవార్మింగ్

పుంగనూరు గ్రామీణ: నేటి నుంచి డీవార్మింగ్ కార్యక్రమం చేపట్టినట్లు పశు సంవర్ధకశాఖ ఏడీ మనోహర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాడిరైతులు, గొర్రెల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువులకు ముసురు వ్యాధి, నీలి నాలుక తదితర వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తగా మందులు వేయించాలన్నారు.

మద్యం వ్యాపారుల నడుమ అద్దెల పోటీ

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటుకు సంబంధించిన చర్యలు చురుగ్గా నడుస్తున్నాయి. లాటరీలో కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లోని భవనాలు చూస్తున్నారు. ఇదే అదనుగా అద్దెభవనాలకు గిరాకీ పెరిగిపోయింది. గతంలో ప్రభుత్వ దుకాణాలను నిర్వహించిన భవనాల్లోనే ప్రస్తుతం కొత్త దుకాణాలు ఏర్పాటు చేయడానికి కొందరు వ్యాపారులు సిద్ధపడుతున్నారు. దీంతో వాటికి అద్దెలు రెట్టింపు చేస్తున్నారనే విమర్శలున్నాయి. పట్టణంలో మొత్తం 6 దుకాణాలు మంజూరయ్యాయి. రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు అద్దెలు చెల్లించడానికి వ్యాపారులు సుముఖంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని గుడియాత్తం రహదారిలో ఓ గది కోసం ఇరు వర్గాల వారు పోటీ పడ్డారు. గురువారం ఒక దశలో వారు గట్టిగా వాదులాడుతూ కేకలు పెట్టుకునే స్థాయికి వచ్చారు. చివరకు ఒకే వరుసలో ఉన్న రెండు భవనాలను చెరి ఒకటి తీసుకుని సర్దుకున్నారు.



గుడుపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఎదుట మలుపుల కూడలి



చెన్నై-ముంబయి జాతీయ రహదారిలో బసవరాజుకండ్రిగ సమీపంలో..

మలుపులు.. మృత్యు పిలుపులు

గుడుపల్లె, పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మూడు నియోజకవర్గాల పరిధిలోని జాతీయ, అంతర్రాష్ట్ర, జిల్లా రహదారుల్లోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. కనీసం సూచనలు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ప్రమాదాల బారిన పడిన ఉదంతాలున్నాయి. ప్రధానంగా గుడుపల్లె, పెద్దపంజాణి మండలాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. గుడుపల్లె మండల కేంద్రం నుంచి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న కూడలి మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి తమిళనాడులోని వేపనపల్లె, కర్ణాటకలోని కామసముద్రం ప్రాంతాలను కలుపుతుంది. నిత్యం భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. పెద్దపంజాణి మండల పరిధిలోని చెన్నై-ముంబయి జాతీయ రహదారిలో బసవరాజుకండ్రిగ సమీపంలో ప్రమాదకర మలుపు ఉంది. ఇక్కడ రోడ్డు పక్కన ఉన్న చెట్లు పెరిగి ఎదుటి వాహనాలు కనిపించడం లేదు. ఎన్‌హెచ్ అధికారులు చర్యలు చేపట్టాలని చోదకులు కోరుతున్నారు.

డయల్ యువర్ డీఎంకు మూడు సమస్యలు

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక ఆర్టీసీ డీఎం సుధాకరయ్య గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో మూడు సమస్యలు వచ్చాయి. వాటిలో కర్ణాటకలోని బెంగళూరు సమీపంలోని బట్టర్‌హళ్లి బస్‌స్టాప్ వద్ద పుంగనూరు ఆర్టీసీ బస్సులు ఆపాలని కోరారు. అలాగే పుంగనూరు నుంచి వి.కోటకు, సోమల నుంచి రాయచోటికి సర్వీసులు నడపాలన్నారు. ఈ వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఎం సుధాకరయ్య తెలిపారు.

కోళ్లపరిశ్రమ నిర్మాణం అడ్డగింత



కోళ్లపరిశ్రమ యజమానులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

కాగతి(చౌడేపల్లె), న్యూస్‌టుడే: గ్రామానికి సమీపంలో నిర్మిస్తున్న ఓ కోళ్ల పరిశ్రమను సమీప గ్రామస్థులు అడ్డుకున్నారు. గురువారం ఈ ఘటన మండలంలోని కాగతి పంచాయతీ యర్రగుంట వద్ద చోటుచేసుకుంది. గ్రామం వద్ద ప్రైవేటు వ్యక్తులు తమ స్థలంలో కోళ్లపరిశ్రమ నిర్మాణం ప్రారంభించేందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న యనసామనపల్లె, పలగార్లపల్లె వాసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. గతంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతామని, వాతావరణాన్ని కలుషితం చేయమని మభ్యపెట్టి యనమసామనపల్లె వద్ద ఓ కంపెనీ కోళ్ల పరిశ్రమ నిర్మించారని, ప్రస్తుతం వారి కాలుష్యంతో నిత్యం చాలా మంది రోగాలతో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఆయా గ్రామాలకు వందల మీటర్ల దూరంలోనే ప్రతిపాదిత నిర్మాణం ఉందని.. తమకు ఇబ్బంది అవుతుందని తేల్చిచెప్పారు. అధునాతన యంత్రాలతో షెడ్లు నిర్మిస్తామని, వ్యర్థాలు బయటకు రాకుండా కొత్త సాంకేతిక పద్ధతులు వినియోగిస్తామని సంస్థ ప్రతినిధులు చెప్పినా గ్రామస్థులు అంగీకరించలేదు. నిర్మాణం నిలిపేయాలని పంచాయతీ కార్యదర్శి చాముండేశ్వరి చెప్పడంతో కంపెనీ యజమానులు వెనుదిరిగారు.

వరకట్న వేధింపులపై రెండు కేసులు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అదనపు కట్నం వేధింపులపై ఇద్దరు వివాహితలు ఫిర్యాదు చేయడంతో వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు గురువారం సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని చంద్రకాంతవీధికి చెందిన విజయశేఖర్‌రెడ్డి కుమార్తె గీతికారెడ్డిని తిరుపతికి చెందిన సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు ముకుందకుమార్‌రెడ్డికి ఇచ్చి గతేడాది వివాహం చేశారు. ముకుందకుమార్‌రెడ్డి అమెరికాలో టెక్సాస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. వెంటనే అక్కడికి తీసుకెళ్తానని చెప్పి ఇప్పటి వరకు ముఖం చాటేశాడు. పుంగనూరులోని తాత మునిరెడ్డి ఆస్తి విక్రయించి తిరుపతిలో ఇల్లు కొనుగోలు ఒత్తిడి చేస్తున్నాడని గీతికారెడ్డి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో.. మండల పరిధి కంగానెల్లూరు గ్రామానికి చెందిన రామకృష్ణ కుమార్తె నందిని వి.కోట మండలం చెల్దిగానిపల్లె గ్రామానికి చెందిన క్రిష్ణప్ప కుమారుడు బీఆర్.చంద్రశేఖర్‌కు 2022లో ఇచ్చి వివాహం చేశారు. బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న చంద్రశేఖర్ అదనపు కట్నం కావాలంటూ రోజు వేధించేవాడు. అత్త మామలు, బాబాయిలు యుగంధర్, లక్ష్మీపతి వేధిస్తుండటంతో నందిని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి మరో బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట జరిగింది. కర్ణాటకలోని రాక్‌వ్యాలీ రిసార్ట్ నుంచి పలమనేరుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న మంజునాథ్, ప్రవీణ్‌కుమార్ మద్యం తాగి పోలీసులు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. రెండు వాహనాలు కిందపడి కానిస్టేబుళ్లు గుణవెంకటరమణ, ఆరిఫ్ గాయపడ్డారు. మద్యం మత్తులో ఉన్న మంజునాథ్, ప్రవీణ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. పీహెచ్‌సీకి ప్రథమ చికిత్స అందించారు. వీరిలో మంజునాథ్‌ను మెరుగైన చికిత్సకోసం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో నీలామోహన్ తెలిపారు.



కూలిన కొబ్బరి చెట్టు

పొలాలపై ఏనుగుల దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని పాతపేట అటవీ ప్రాంతంలో తిష్ట వేసిన 16 ఏనుగుల గుంపు బుధవారం రాత్రి బీభత్సం సృష్టించాయి. పాతపేట సమీపంలోని పంట పొలాలపై దాడి చేశాయి. వెంకటరత్నం, దొరస్వామి, సురేష్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం రైతులు సాగు చేసిన ఐదు ఎకరాల వరిని తొక్కి నాశనం చేశాయి. సురేష్, వెంకటరత్నం, సుబ్రమణ్యం రైతులకు సంబంధించిన ఏడు కొబ్బరి చెట్లను కూల్చాయి. వై.సుబ్రమణ్యం రైతు సాగు చేసిన టమాటా పంటపై ఏనుగులు రెండుసార్లు దాడి చేయగా, బుధవారం మళ్లీ దాడి చేసిన ఏనుగులు టమోటా పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. రూ.లక్షల్లో పంట నష్టం వాటిల్లిందని పాతపేట గ్రామానికి చెందిన రైతులు వాపోయారు.

ఒంటరి ఏనుగు సంచారం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: తమిళనాడు అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఒంటరి ఏనుగు బుధవారం అర్ధరాత్రి నడుమూరు ప్రాంతం నుంచి జనావాసాల్లోకి ప్రవేశించింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు దారి మళ్లించేందుకు ప్రయత్నించగా గురువారం ఉదయం నూలుకుంట అటవీ ప్రాంతానికి చేరుకుంది. ప్రస్తుతం కంగుంది అటవీ ప్రాంతంలో మకాం వేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

శాంతిపురం, న్యూస్‌టుడే: స్థానిక 132/33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని లైన్ల మరమ్మతుల కారణంగా ఈనెల 19న శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రెస్కో ఏడీఈ హిమ్మత్‌సాగర్ తెలిపారు. శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాల్లోని 22 ఉపకేంద్రాల పరిధిలో నిర్దేశిత సమయంలో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొదుపు రుణాలతో భవిత బంగారం

● స్వయం ఉపాధిపై మహిళల దృష్టి
● వ్యాపారాల్లో రాణిస్తూ కుటుంబాలకు అండ

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: గ్రామీణ మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించారు. ప్రధానంగా స్వయంసహాయక సంఘాల్లో సభ్యులుగా ఉంటూ తాము వివిధ రకాల వ్యాపారాలు సాగిస్తూ రాణిస్తున్నారు. కుటుంబ పోషణలో భర్తకు చేదోదు వాదోడుగా ఉంటూ తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తూ తోటి సభ్యులకు ఆదర్శంగా నిలుస్తూ ఆర్థికంగా అభివృద్ధి బాట పట్టారు.

టెర్రకోట బొమ్మలు విక్రయిస్తూ..



చలమంగళం గ్రామానికి చెందిన **పావని.** మమత స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. వ్యవసాయంలో భర్తకు చేదోడుగా ఉంటూ తల్లిదండ్రుల సహకారంతో టెర్రకోట బొమ్మల తయారీపై శిక్షణ తీసుకున్నారు. మదనపల్లె, బెంగళూరు ప్రాంతాలనుంచి టెర్రకోట బొమ్మలు తెచ్చుకుని స్వయంగా రంగులేసి అందమైన అలంకరణ వస్తువులు విక్రయిస్తోంది. ఆన్‌లైన్‌లో తెచ్చుకోవడం, విక్రయించడం చేస్తోంది. వ్యాపార నిర్వహణకు అవసరమైన రూ.2 లక్షలు వివిధ రకాల రుణంగా తీసుకుని చక్కగా వ్యాపారం నిర్వహిస్తోంది. చెన్నై-ముంబయి జాతీయ రహదారిని ఆనుకుని పత్తికొండ వద్ద టెర్రకోట బొమ్మల విక్రయాలు చేస్తూ రుణాలు చెల్లిస్తూ ఆదాయాన్ని పొందుతోంది.

మిఠాయి దుకాణం నిర్వహిస్తూ..



రాయలపేటలోని రాయల్ స్వయం సహాయక సంఘంలో సంఘంలో **ఉమ** సభ్యురాలు. స్వయం ఉపాధి పొందేందుకు బజారువీధిలో స్వయంగా మిఠాయి దుకాణం పెట్టారు. నిర్వహణకు అవసరమైన రూ.5లక్షలను రుణంగా తీసుకున్నారు. బ్యాంకు, పొదుపు, వీవో, సీసీఎల్ రుణాలు సక్రమంగా క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. సంఘ సమావేశాలకు సక్రమంగా హాజరై తోటి సభ్యులకు స్వయం ఉపాధికి సలహాలు అందిస్తున్నారు.

రూ. 4.25 లక్షల రుణం తీసుకుని



రాయలపేట మహమ్మద్ స్వయం సహాయక సంఘం సభ్యురాలు **ముబీనా**. పలమనేరు-చౌడేపల్లె ప్రధాన మార్గంలో దుస్తులు, ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నారు. పొదుపు, వీవో, బ్యాంకు, స్త్రీనిధి ద్వారా రూ. 4.25 లక్షల రుణం తీసుకుని వ్యాపారం చేస్తూ ఆదాయం పొందుతున్నారు. రుణాలు సక్రమంగా చెల్లిస్తూ కుటుంబపోషణలో భర్తకు చేదోడుగా ఉంటారు. సంఘ సమావేశాలకు సక్రమంగా హాజరై సంఘాల్లోని సభ్యులకు తాను చేపట్టిన వ్యాపారాల గురించి వివరిస్తోంది.

కిరాణాషాపుతో ఆదాయం



రాయలపేటలోని రాయల్ స్వయం సహాయక సంఘంలో **మంజుల** సభ్యురాలు. పలమనేరు-చౌడేపల్లె ప్రధాన మార్గం బజారువీధిలో కిరాణాషాపు నిర్వహిస్తున్నారు. అవసరమైన రూ. 5.50లక్షలు వివిధ రకాల రుణాలుగా తీసుకుంది. పొదుపు, బ్యాంకు, వీవో, స్త్రీనిధి, సీసీఎల్ వంటి రుణాలు సక్రమంగా బ్యాంకుకు చెల్లిస్తూ వ్యాపారాన్ని లాభసాటిగా చేస్తున్నారు. భర్త సహకారం ఉంది. ఇంటిపనులు చేసుకుంటూ వ్యాపారం చేయడం సంతోషంగా ఉంటుందన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

శాంతిపురం: మండల కేంద్రం బస్టాండు సమీపంలో ద్విచక్ర వాహనం చోరీ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కుప్పం పీఈఎస్ వైద్య విద్యార్థి విజయ్‌కుమార్ తన ద్విచక్రవాహనాన్ని జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంచాడు. రాత్రి సమయంలో దొంగలు తీసుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.